సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం ౹ 1 ౹ సెప్టెంబర్ ౹ 2024



ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత
ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు.
8లో



సమస్యల ఏకరువు 8లో
పి.యర్రగొండ ఏకలవ్య విద్యార్థులు.. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వద్ద తమ సమస్యలను ఏకరువుపెట్టారు.



త్వరితగతిన సమస్యల పరిష్కారం
క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశించారు.
8లో

బిడ్డలకేమైందో...
తల్లడిల్లిన తల్లిదండ్రులు

- ఫుడ్‌పాయిజన్ సమాచారంతో ఆస్పత్రికి పరుగులు
- హాస్టల్ నుంచి విద్యార్థినులను ఇళ్లకు తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు
- మరో 40 మందికి అస్వస్థత
- 26 మంది డిశ్చార్జ్



పిల్లలను ఇళ్లకు తీసుకు వెళుతున్న కుటుంబ సభ్యులు



అరకులోయ ఆస్పత్రిలో పిల్లలకు భోజనం తినిపిస్తున్న తల్లులు

సాక్షి,పాడేరు: జామిగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురైన సమాచారం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు తీవ్రంగా తల్లడిల్లిపోయారు. తమ పిల్లల క్షేమసమాచారం తెలుసుకునేందుకు ఆస్పత్రి, హాస్టల్ వద్దకు పరుగులు తీశారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తమ కుమార్తెలను చూసి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నీరసంగా ఉన్న వారిని చూసి కంటతడి పెట్టుకున్నారు. శుక్రవారం రాత్రి 79 మంది గిరిజన విద్యార్థినులు వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో 61మంది అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిలో కోలుకుంటుండగా, శనివారం ఉదయం కూడా మరో 40 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తరలించారు. 26 మంది విద్యార్థినులు కోలుకోవడంతో వారిని తల్లిదండ్రులు తమ ఇళ్లకు తీసుకుపోయారు. ప్రస్తుతం 61మంది విద్యార్థినులకు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి తల్లిదండ్రులంతా ఆస్పత్రికి చేరుకుని తమ బిడ్డలను చూసి తల్లడిల్లిపోయారు. ఎంత త్వరగా కోలుకుంటారా, అంత త్వరగా ఇంటికి తీసుకువెళ్లిపోదామా అని వారు ఆస్పత్రి వద్ద వేచి ఉన్నారు. జామిగుడ ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్యంగా ఉన్న విద్యార్థినులను కూడా వారి తల్లిదండ్రులు భయంతో ఇళ్లకు తీసుకుపోతున్నారు. ఇప్పటికే సుమారు 120 మంది వరకు ఇళ్లకు వెళ్లిపోయారు.మిగిలిన విద్యార్థినులు కూడా భయాందోళనతో బిక్కుబిక్కుమంటు ఆశ్రమ పాఠశాలలో ఉన్నారు. ఇంటికి వచ్చేస్తామని, తీసుకువెళ్లాలని కోరుతూ తల్లిదండ్రులకు వారు కూడా సమాచారం అందిస్తున్నారు.

పాఠశాలలో సురక్షిత తాగునీరు కరువే

జామిగుడ బాలికల ఆశ్రమ పాఠశాలలో సురక్షిత తాగునీరు కూడా కరువైంది. తాగేందుకు, కాలకృత్యాలు,స్నానాలన్నింటికి ఒక ట్యాంకులో నీటినే విద్యార్థినులు వినియోగిస్తున్నారు. ఈనీరు కూడా కలుషితంగా ఉంది.

హెచ్‌ఎం సుజాత వైఖరిపై ఆగ్రహం

జామిగుడ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సుజాత డిప్యూటీ మేట్రిన్‌గాను అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎం సక్రమంగా మెనూ అమలుజేయడం లేదనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి.శుక్రవారం రాత్రి కూడా కూరగాయలు,రసంతో కూడిన భోజనం పిల్లలకు వండిపెట్టాలి.కూరగాయలు లేవనే నెపంతో మధ్యాహ్నం ఇవ్వాలిసిన ఉడికించిన గుడ్డు రాత్రికి కూర రూపంలో వండి వడ్డించారు. రాత్రి సమయంలో గుడ్డు తినడం, అవి కూడా నాసిరకంగా ఉండడం వల్ల విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు.గతంలోను ఓ గిరిజన బాలిక రక్తహీనతతో మృతిచెందిన సమయంలోను అధికారుల ఆగ్రహానికి హెచ్‌ఎం గురయ్యారు.ఆశ్రమ పాఠశాల నిర్వహణ లోపాలపైన తల్లిదండ్రులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన



పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

డుంబ్రిగుడ:బాధ్యులైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థినుల తల్లిదండ్రులు జామగుడ పాఠశాల వద్ద ఆందోళన చేశారు. కలెక్టర్ వాహనాన్ని అడ్డగించారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాలదేవ్ మాట్లాడుతూ కనీస సౌకర్యాలు కల్పించి, నాణ్యమైన ఆహారం, విద్య అందించాలని కోరారు. డీడీ కొండలరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

పిల్లల కోసమా...పశువులు తినడానికా

- ఆశ్రమపాఠశాలలో ఆహారపదార్థాలను పరిశీలించి ఆగ్రహించిన కలెక్టర్
- జాముగుడ పాఠశాలను తనిఖీ చేసిన దినేష్‌కుమార్



పాల ప్యాకెట్లను భద్ర పరిచే ఫ్రిజ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ (ఇన్‌సెట్) పులిహోర

డుంబ్రిగుడ: జాముగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలలో విద్యార్థినులకు పెట్టిన ఆహారాన్ని పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్‌పాయిజన్ జరిగిన విషయం తెలుసుకున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో అభిషేక్ వేర్వేరుగా శనివారం ఆశ్రమ పాఠశాలను, అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రిని సందర్శించారు. ఆశ్రమపాఠశాలలో శనివారం తయారు చేసిన నాణ్యతలేని వంటకాలను పరిశీలించి సిబ్బందిపై కలెక్టర్ మండిపడ్డారు.'పిల్లల కోసమా ...పశువులకు పెట్టేదానికా' ఈ పులిహోరను తయారు చేశారని ఆగ్రహించారు. శుక్రవారం రాత్రి విద్యార్థినులకు పెట్టిన ఆహారంపై ఆరా తీశారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మూడు పూటలా పెడుతున్న ఆహార పదార్థాలను ఫొటోలు తీసి అప్లోడ్ చేసి పర్యవేక్షించాలని డీడీ కొండలరావును ఆదేశించారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

ఈఘటనపై కమిటీని ఏర్పాటు చేసి, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. డీడీ, తహసీల్దార్, ఎంపీడీవో, ఏటీడబ్ల్యూవోలతో కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం పాఠశాలలో మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన వంకాయ బఠానీ కూరలో బఠాని ఉడకపోవడం, సాంబారులో పప్పు తక్కువగా ఉండడాన్ని గమనించిన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల శాంపిళ్లను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వేణుగోపాల్‌తో సేకరించిన ఆయన పరిశీలించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి
- అరకులోయ ఆస్పత్రి, జాముగుడలో హాస్టల్‌ను సందర్శించిన ఎంపీ



జాముగుడ ఆశ్రమపాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీ తనూజ రాణి

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ: డుంబ్రిగుడ మండలం జాముగుడ గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమపాఠశాలలో శుక్రవారం జరిగిన ఫుడ్‌పాయిజన్ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విధుల నుంచి తొలగించాలని అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి డిమాండ్ చేశారు. అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని, జాముగుడలో గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమపాఠశాలను మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి శనివారం ఆమె సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి, స్టెతస్కోప్‌తో పరీక్షించారు. జాముగుడలో ఎంపీ మాట్లాడుతూ ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం, ఇతర సిబ్బందిపై మండిపడ్డారు. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు పెట్టాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా డీడీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీపీలు ఉషారాణి, ఈశ్వరి, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, రామన్న, లలిత, సర్పంచ్‌లు నాగేశ్వరావు, రమేష్, నాయకులు సింహాచలం, కృష్ణారావు, జగ్గునాయుడు అరకులోయ మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లే...

- ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు



అరకులోయ ఆస్పత్రిలో విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవిబాబు

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ: గిరిజన విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు విమర్శించారు. ఫుడ్‌పాయిజన్ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డుంబ్రిగుడ మండలం జాముగుడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను శనివారం ఆయన పరామర్శించారు.అనంతరం జాముగుడలో పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎం నుంచి డీడీ వరకు అందరూ బాధ్యతరహితంగా వ్యవహరించడం వల్లే ఇంత ఘోరమైన సంఘటన జరిగిందని, వారి అందరి మీద క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం పర్యవేక్షించాల్సిన డీడీ నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని, హాస్టల్‌లో ఒక్క రికార్డు కూడా సక్రమంగా లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే విద్యావ్యవస్థ సర్వనాశనమైపోయిందని, విద్యార్థులు రోడెక్కే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఇంత పెద్ద సంఘటన జరిగినా అధికారులు తగిన విధంగా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి వసతి గృహంలో నాణ్యత, రుచీపచీలేని ఆహారాన్ని పెడుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని చెప్పారు. వైద్యాధికారుల అప్రమత్తం కారణంగా ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు. గతంలో ఇదే జాముగుడ పాఠశాలలో వివిధ కారణాలతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందితే తూతూమంత్రంగా చర్యలు తీసుకుని, హెచ్‌ఎంకే వార్డెన్ బాధ్యతలు అప్పగించారని చెప్పారు. ఈసంఘటనపై విచారణకు ఐటీడీఏ పీవో వేసిన కమిటీని వ్యతిరేకిస్తున్నామని, జాయింట్ కలెక్టర్‌తో కూడిన విచారణ కమిటీని నియమించి డీడీ,ఏటీడబ్ల్యూవో, వసతి గృహం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, మాజీ సర్పంచ్‌లు ప్రకాష్,విజయ్‌కుమార్, తాంగుల రాందాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరావు, దేముడు, సామాజిక కార్యకర్త, ఆమ్ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత కూడా విద్యార్థులను పరామర్శించారు.

పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి అవసరం

- అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారిణి వలసనైని రవని



రవనిని సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పెదబయలు: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని, నిరంతరం సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని అంతర్జాతీయ మహిళ క్రికెట్ జట్టు క్రీడాకారిణి పలసనైని రవని అన్నారు. ప్రత్యేక అతిథి పరిచయ కార్యక్రమంలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల స్థాయి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆమెను పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. హెచ్‌ఎం టి.నాగేశ్వరరావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గిడ్డి రామనాయుడు, వైస్ ఎంపీపీ కొండలరావు పాల్గొన్నారు.

మాచ్‌ఖండ్‌లో మెరుగుపడిన విద్యుత్ ఉత్పత్తి



మాచ్‌ఖండ్‌లో ఒకటో నంబర్ జనరేటర్‌కు మరమ్మతులు చేస్తున్న ప్రాజెక్టు అధికారులు

- వినియోగంలోకి వచ్చిన ఒకటో నంబర్ జనరేటర్
- 80 మెగావాట్లకు చేరిన ఉత్పత్తి
- జలాశయాల్లో పెరిగిన నీటి నిల్వలు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి మెరుగుపడింది.గత కొంత కాలం కిందట పాడైన ఒకటో నంబర్ జనరేటర్ ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది.మాచ్‌ఖండ్‌లో ఈ ఏడాది మే నెల 19వ తేదీన ఒకటో నంబర్ సంబంధించిన ఎంబీఎంలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రాజెక్టు అధికారులు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. రెండు రోజుల కిందట జనరేటర్ మరమ్మతు పనులు మొదలు పెట్టి తీవ్రంగా శ్రమించి శనివారం మధ్యాహ్నం వినియోగంలోకి తీసుకువచ్చి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. దీంతో 1,3,4,6 నంబర్ల జనరేటర్ల సహాయంతో 80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.2,5 నంబర్ల జనరేటర్ల మరమ్మతులకు గురై ఉన్నాయి.వీటిని సైతం వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు మాచ్‌ఖండ్ ప్రాజెక్టు అధికారులు చర్యలు చేపట్టారు.మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రానికి నీరు అందించే జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి.డుడుమ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 2590 అడుగులు కాగా, శనివారం నాటికి 2581.90 అడుగుల నీటిమట్టం ఉంది. జోలాపుట్టు జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 2,750 అడుగులు కాగా, 2,545.30 అడుగులుగా నమోదైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు 481.58 క్యూసెక్కుల నీరు జోలాపుట్టు జలాశయం లోకి వచ్చి చేరుతోంది.

దంచికొట్టిన వర్షాలు

- జన జీవనానికి అంతరాయం
- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు,వాగులు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



కించుమండ-అరకు జాతీయ రహదారిలో కురుస్తున్న వర్షం



ఉధృతంగా ప్రవహిస్తున్న హుకుంపేటలో రాళ్లగెడ్డ

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో జిల్లాలో ప్రధాన గెడ్డలు,కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.శనివారం ఉదయం తేలికపాటి వర్షం కురవగా,మధ్యాహ్నం తరువాత భారీ వర్షం కురిసింది.సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉండడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాజవొమ్మంగి మండలంలో కొండవాగుల నీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల భీకర శబ్దాలతో పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ముంచంగిపుట్టు, హుకుంపేట, రాజవొమ్మంగిలలో వారపుసంతలకు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా వాహన చోదకులు, ప్రయాణికులు తడిచి ముద్దయ్యారు.ప్రాథమిక పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్ల వద్దే ఉన్నారు.

454.40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లా వ్యాప్తంగా శనివారం 454.40 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వి.ఆర్.పురం మండలంలో 46.2, పెదబయలు 45.6, జి.మాడుగుల 41, కూనవరం 35.6, జీకే వీధి 30.2, ఎటపాక 28.2, పాడేరు 22.4, ముంచంగిపుట్టు 21.4, మారేడుమిల్లి 20.2, చింతూరు 15.6, కొయ్యూరు 14.8, వై.రామవరం 12.4, అనంతగిరి 10.6, డుంబ్రిగుడ 9.4, దేవీపట్నం 8.6 అరకులోయ 8.2, హుకుంపేట మండలంలో 5.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మరో నాలుగు రోజులు వర్షాలు

రానున్న మూడు,నాలుగు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని,రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు.శనివారం ఆయన అన్ని మండలాల తహసీల్దార్లు ,ఇతర అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే విధంగా 08935-299912,08935-293488 నంబర్లతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పాడేరు,రంపచోడవరం,చింతూరు ఐటీడీఏ కార్యాలయాలతో పాటు అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నష్టాలను గుర్తించాలని సూచించారు.

రంపచోడవరం ఐటీడీఏలో...

రంపచోడవరం: భారీగా వర్షాలు పడుతున్నందున రంపచోడవరం ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 9347759019, 8309388727 అనే నంబర్లతో, ఐటీడీఏ కార్యాలయంలో 9492920383, 6303269069, 9441058467, 18004252123 అనే నంబర్లతో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వర్షాలు కారణంగా కొండవాగుల పొంగి ప్రవహిస్తాయని, వాటిని దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. భారీ వర్షాలు కారణంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఆదివారం ప్రధాన కేంద్రంలో అందుబాటులో ఉండాలని ఆదేశించినట్లు తెలిపారు. ఉద్యోగులకు సెలవులు మంజూరు చేయడం జరగదన్నారు.

ఘాట్ రోడ్లలో భారీ వాహనాలు నిషేధం

సాక్షి,పాడేరు: రానున్న మూడు,నాలుగు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని ఘాట్‌రోడ్లలో భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.నర్సీపట్నం-సీలేరు ఘాట్‌రోడ్డు, పాడేరు-వడ్డాది ఘాట్‌రోడ్, అరకు-అనంతగిరి, రంపచోడవరం, మారేడుమిల్లి, చింతూరు ఘాట్‌రోడ్లలో భారీ వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు కూడా భారీ వాహనాల రాకపోకల నిషేధాన్ని కచ్చితంగా అమలుజేయాలని ఆదేశించారు.

న్యూస్‌రీల్

జిల్లాలో తగ్గిన 677 పింఛన్లు



ఉర్రాడలో సామాజిక పింఛన్ నగదు అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలో ఈ నెలలో 677 సామాజిక పింఛన్లు తగ్గాయి. వీరిలో 632 మంది పింఛన్‌దారులు మృతిచెందారని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. మిగిలిన వారికి వివిధ కారణాలతో మంజూరు చేయలేదు. గత నెలలో 1,25,946 మందికి ఎన్టీఆర్ భరోసా పథకంలో సామాజిక పింఛన్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈనెల మాత్రం 1,25,269 మందికి మాత్రమే మంజూరు చేసింది. శనివారం జిల్లా వ్యాప్తంగా సామాజిక పింఛన్ల పంపిణీని ప్రభుత్వం సచివాలయాల ఉద్యోగుల ద్వారా చేపట్టింది. కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ హుకుంపేట మండలం ఉర్రాడ గ్రామంలో పింఛన్లను పంపిణీ చేశారు. సాయంత్రం 6గంటల సమయానికి జిల్లా వ్యాప్తంగా 91.03 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ మురళీ విలేకరులకు తెలిపారు.

పోలీసు ఉద్యోగాలకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

జి.మాడుగుల: పోలీసు ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు విశాఖపట్నంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు స్థానిక సీఐ సీహెచ్ వెంకటరావు తెలిపారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణను అర్హులైన గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత శిక్షణ సమాచారంకోసం సచివాలయాల్లో మహిళా పోలీసులను, స్థానిక పోలీస్ స్టేషన్లలో సంప్రదించవచ్చని చెప్పారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసి, అనుమతు పొందాలని చెప్పారు. గిరిజన యువత గంజాయి కేసుల్లో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.గ్రామాల్లో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

మండలాలకు ప్రత్యేకాధికారులు

సాక్షి,పాడేరు: ప్రభుత్వం అమలుజేస్తున్న సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణకు జిల్లాలోని 22 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ శనివారం ఉత్వర్వులు జారీ చేశారు. పాడేరు డివిజన్‌లో ముంచంగిపుట్టు మండలానికి గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు,పెదబయలకు ఫుడ్ సేఫ్టీ అధికారి పి.వేణుగోపాలరావు, డుంబ్రిగుడకు జిల్లా వ్యవసాయాధికారి నందు, అరకులోయకు జిల్లా ఉద్యానవనశాఖాధికారి రమేష్ కుమార్‌రావు,హుకుంపేటకు జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు,అనంతగిరికి ఎస్‌డీసీ వి.వి.ఎస్.శర్మ, పాడేరుకు డీఆర్‌డీఏ పీడీ మురళీ, జి.మాడుగులకు డ్వామా పీడీ ఎం.శివయ్య, జీకేవీధి మండలానికి ఆర్‌అండ్‌బీ ఈఈ బాల సుందరబాబు,కొయ్యూరుకు హౌసింగ్ పీడీ శ్రీనివాస్‌ను నియమించారు.

రంపచోడవరం డివిజన్‌లో..

రంపచోడవరం మండలానికి పశుసంవర్ధకశాఖ ఏడీ అహ్మద్‌షరీఫ్,దేవీపట్నానికి గిరిజన సంక్షేమ ఈఈ డేవిడ్‌రాజు, వై.రామవరానికి పీహెచ్‌వో చిట్టిబాబు, రాజవొమ్మంగికి ఎస్‌డీసీ జాన్‌బాబు,అడ్డతీగలకు గిరిజన సంక్షేమ డీఈఈ నాగరాజు, మారేడుమిల్లికి డీఈఈ చైతన్య,గంగవరానికి డీఎల్‌పీవో రాఘవేంద్ర,చింతూరు డివిజన్‌లోని వి.ఆర్.పురానికి పీఆర్ ఏఈఈ పి.రామకృష్ణారెడ్డి,చింతూరుకు ఎస్‌డీసీ అంబేడ్కర్,కూనవరానికి ఎస్‌డీసీ లక్ష్మిపతి, ఏటపాకకు గిరిజన సంక్షేమ ఈఈ జి.మురళీలను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

బొర్రా గుహలపై రైల్వే రెండో లైన్ వేయొద్దు

- అరకు ఎంపీ తనూజ రాణి
- సర్వే కమిటీతో కలిసి గుహల పరిశీలన
- సభ్యులకు అనర్థాలను వివరించిన స్థానిక గిరిజనులు



గుహల వద్ద ఎంపీ తనూజరాణి, కమిటీ సభ్యులు

అనంతగిరి(అరకులోయటౌన్): అనంతగిరి మండలంలోని బొర్రా గుహలపై నుంచి ఎట్టిపరిస్థితుల్లో రెండో రైల్వేలైన్ వేయరాదని, అలావేస్తే గుహలు కూలిపోయే ప్రమాదం ఉందని అరకు ఎంపీ తనూజ రాణి రైల్వే ఉన్నతాధికారుల కమిటీకి తెలిపారు. గుహలకు కిలోమీటరు దూరంలో లైన్ వేయాలని సూచించారు. బొర్రా గుహలపై రెండో రైల్వే లైన్ వేయడంవల్ల అవి కూలిపోయే ప్రమాదం ఉందని కేంద్ర రైల్వేశాఖ మంత్రికి ఎంపీ చేసిన ఫిర్యాదు మేరకు రైల్వే మంత్రిత్వ శాఖ ఐదుగురు సభ్యులతో కూడిన ఓ కమిటీని నియమించింది. ఆ కమిటీ సభ్యులు శనివారం పాడేరులోని ఎంపీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని, రెండోలైన్‌కి సంబంధించిన ప్లాన్ మ్యాప్‌లను చూపించి, ఎటువంటి ప్రమాదం లేదని వివరించారు. అయితే దానికి అంగీకరించని ఎంపీ, బొర్రా గుహల వద్దకు శనివారం రాత్రి కమిటీ సభ్యులతో పాటు వెళ్లారు. స్థానిక గిరిజనులతో కలిసి కమిటీ సభ్యులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న లైన్‌లో రైళ్ల రాకపోకల కారణంగా గుహల్లో బండరాళ్లు పడుతున్నాయని, చారిత్రాత్మకమైన గృహలు దెబ్బతినే పరిస్థితి ఉందని కమిటీకి తనతో పాటు గిరిజనులు వివరించినట్టు ఎంపీ తెలిపారు. అందువల్ల గుహలకు కిలోమీటరు దూరంలో రెండో లైన్ వేయాలని సూచించారు.దీంతో రీ సర్వేకు కమిటీ సభ్యులు అంగీకరించినట్టు ఎంపీ చెప్పారు. త్వరలో రీసర్వే చేయనున్నారని తెలిపారు. కమిటీ సభ్యుల్లో భువనేశ్వర్‌లోని రైల్వే చీఫ్ అడ్మిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ.జి.శ్రీనివాసరావు, విశాఖపట్నం రైల్వే చీఫ్ ఇంజినీర్ డి.శ్రీనివాస్, ఏయూ ప్రొఫెసర్ శంకరం, అసిస్టెంట్ ప్రొఫెసర్ కరుణాకర్ ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే పాల్గుణ,వైఎస్సార్‌సీపీ రాష్ట్రయువజన విభాగం రాష్ట్రప్రధానకార్యదర్శి వినయ్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ హిమగిరి

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్తంగా సెప్టెంబర్ 3న నిర్వహించనున్న జాబ్‌మేళాను అర్హులైన గిరిజన యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని సీఐ ఎల్.హిమగిరి తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్‌ను నిర్వాహకులతో కలిసి స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకోసం 9959232313 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

గుడ్ల సరఫరాదారులపై ఎమ్మెల్యే ఆగ్రహం


వ్యాన్ ద్వారా సరఫరా చేస్తున్న గుడ్లను పరిశీలిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకంలో సరఫరా చేసే గుడ్లలో నాణ్యత లేకపోవటం, పరిమాణం చిన్నదిగా ఉండడంపై గుడ్ల సరఫరా దారులపై పాడేరు ఎమ్మెల్యే, వైస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పినలోచలి మార్గంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేస్తున్న గుడ్ల వ్యాన్ నిలిపారు. గుడ్ల నాణ్యతను ఆయన పరిశీలించారు. ఆశ్రమ వసతి గృహాల్లో తరచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా గుత్తేదారుల్లో మార్పు రావడంలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతలేని, కుళ్లిపోయిన గుడ్లు పరఫరా చేసి గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని హరిస్తున్నారని ఈ విషయాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన తెలిపారు.

బాధిత విద్యార్థులకు పీవో పరామర్శ

- సంఘటనకు సంబంధించి ఐటీడీఏ పీవో అభిషేక్ ఆరా
- సంఘటనపై విచారణ కమిటీ


.సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న చిన్నారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్


విద్యార్థినులకు రొట్టెలు అందజేస్తున్న పీవో అభిషేక్

అరకులోయటౌన్: అరకు నియోజకవర్గం పరిధిలోని డుంబ్రిగుడ మండలం జామిగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కలుషిత ఆహారం తిని అరకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పాడేరు ఐటీడీఏ పీఓ అభిషేక్ శనివారం పరామర్శించారు. వార్డులో చికిత్స పొందుతున్న విద్యార్థినుల వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవలను అడిగితెలుసుకున్నారు. వైద్యుల సూచనల మేరకు బాధిత విద్యార్థినులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేయాలని టీడబ్ల్యూ డీడీ కొండలరావుకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థులు వాంతులు, కడుపు నొప్పితో బాధపడుతుంటే రాత్రి 8:30 గంటలకు చెబుతారా అని డీడీ కొండలరావుకు ప్రశ్నించారు. జాయిగుడ పాఠశాలలో చదువుతూ కలుషిత ఆహారం తీసుకొని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 9వ తరగతి విద్యార్థిని బురిడి హేమలత, అదే పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కొర్రా పార్వతి సికిల్‌సెల్ ఎనిమియాతో బాధపడుతున్నట్టు తల్లిదండ్రుల ద్వారా తెలుసుకున్న పీవో మాట్లాడుతూ బాధిత ఇద్దరు విద్యార్థినుల పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించి కావలసిన బ్లడ్ గ్రూప్ రక్తం ఎక్కించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాముకు ఆదేశించారు. జామిగుడ వసతిగృహంలో మరమ్మతుకు గురైన ఆర్‌ఓ ప్లాంట్ వెంటనే బాగు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని డీడీకి సూచించారు. వసతి గృహంలో మెను ప్రకారంగా వండి వడ్డించడం లేదని పాఠశాల హెచ్ఎం సుజాతకు పలుమార్లు ప్రశ్నించినా పట్టించుకోలేదని పీవో అభిషేక్‌కు ఓ విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పీవో మాట్లాడుతూ ఇకపై మెనూ సక్రమంగా పెట్టకపోతే తనకు నేరుగా ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, అందరు కోలుకుంటున్నారన్నారు. అవసరమైతే విశాఖ కేజీహెచ్, పాడేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. కలుషిత ఆహారం తిని అస్వస్థకు గురైన విద్యార్థులకు డుంబ్రిగుడ, కిల్లోగుడ పీహెచ్‌సీ వైద్యులు వసతి గృహానికి వెళ్లి వైద్యం అందించారని, మెరుగైన వైద్యం కోసం అరకు ఆస్పత్రికి తరలించామన్నారు. వైద్యులు సకాలంలో స్పందించి మంచి సేవలందించారని సంతృప్తి వ్యక్తం చేశారు.

సంఘటనపై విచారణ కమిటీ

జామిగుడ ఆశ్రమ పాఠశాలలో జరిగిన సంఘటనపై టీడబ్ల్యూ డీడీ కొండలరావు నేతృత్వంలో కమిటీ నియమించామని, కమిటీలో ఎంపీడీవో, తహసీల్దార్, ఏటీడబ్ల్యూ ఉంటారన్నారు. కమిటీ విచారణ ఆధారంగా పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. జామిగుడు పాఠశాల ఆవరణం అపారిశుధ్యంగా ఉండడాన్ని గమనించి ఇటీవల హెచ్ఎం సుజాతకు షోకాజ్ నోటిసు జారీ చేశామన్నారు. ఆయన వెంట డిఎంహెచ్ డాక్టర్ జమాల్‌బాషా, డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాము, వైద్యులున్నారు.

గంజాయి నిందితులను అరెస్టు చేయాలి

అనకాపల్లి : పోలీసు దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ప్రధానమైన కేసుల్లో నిందితులను తక్షణమే అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. తమ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశంలో ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, ఇప్పటికే కొంతమంది నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకి చెందిన నిందితులను స్థానిక పోలీసులు సహాయంతో అరెస్టు చేయాలన్నారు. రహదారుల్లో ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారితో మాట్లాడి అక్రమ మీడియన్‌లను మూయించడం, స్టాపర్ బోర్డులు, బ్లింకర్స్ ఏర్పాటు చేయాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో మొబైల్ టీమ్‌లు ఉండేలా చూడాలని ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయాలన్నారు. రాబోయే లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ కేసులను ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ చేసి స్వచ్ఛందంగా రాజీ పడేలా చూసి తద్వారా కేసులు తగ్గించాలన్నారు. పెండింగ్ కేసులలో దర్యాప్తును పూర్తి చేసి అభియోగ పత్రాలను కోర్టులో సమర్పించి యూ.ఐ కేసులను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థినులందరూ కోలుకుంటున్నారు


ఆస్పత్రిలో బాధిత విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


విద్యార్థినులకు ధైర్యం చెబుతున్న కలెక్టర్

అరకులోయ రూరల్/ డుంబ్రిగుడ: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులందరూ కోలుకుంటున్నారని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ తెలిపారు. డుంబ్రిగుడ మండలం జామగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురై అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను శనివారం పరామర్శించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు జామగుడ ఆశ్రమ పాఠశాలలో భోజనం చేసిన విద్యార్థినులకు వాంతులు ప్రారంభం కావడంతో వెంటనే వైద్యాధికారులు ఆశ్రమ పాఠశాలకు చేరుకుని వైద్యం అందించారని చెప్పారు. 61 మంది విద్యార్థినులను అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించినట్టు చెప్పారు. ఒక విద్యార్థిని మలేరియాతో బాధపడుతున్నట్టు గుర్తించి ప్రత్యేకంగా వైద్యసేవలు అందిస్తున్నమని చెప్పారు. ఆస్పత్రిలో చిన్న పిల్లల వైద్యులు, జనర్ ఫిజీషియన్లు మెరుగైన వైద్యం అందిస్తున్నారని అన్నారు. అందరూ కోలుకుంటున్నారని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసిన గుడ్లలో కొన్ని పాడైనట్లు గుర్తించామని తెలిపారు. సిబ్బందిని మారుస్తామని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్‌గౌడ్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, ఆస్పత్రి వైద్యాధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారం

చింతూరు: క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని చింతూరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన డివిజన్, మండలస్థాయి అధికారులతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను అధికారులు స్వయంగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన స్థానిక జీసీసీ గొడౌను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులందరికీ సక్రమంగా రేషన్ అందించాలని, పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాలన్నారు. స్థానిక కేజీబీవీని సందర్శించిన ఆయన స్టోర్‌రూంలో కూరగాయలు, గుడ్లను తనిఖీ చేశారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందజేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. చట్టిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆవరణలో మొక్కను నాటడంతో పాటు పిల్లలతో ముచ్చటించారు. నిమ్మలగూడెంలో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు.

ఐటీడీఏ పీవో వద్ద సమస్యల ఏకరువు

- పరిష్కరించాలని కోరిన యర్రగొండ ఏకలవ్య విద్యార్థులు


పి.యర్రగొండలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో సింహాచలం

వై.రామవరం: ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం వద్ద పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యార్థులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, తమ సమస్యలను తీర్చే నాథుడే కరవయ్యాడని వారు వాపోయారు.దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. శనివారం ఆ పాఠశాలను పీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. పిన్సిపాల్‌తోసహా 17 మంది ఇతర రాష్ట్రాల టీచర్లను ఇక్కడ నియమించారని, వారు హిందీలో మాత్రమే మాట్లాడుతున్నారని చెప్పారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వారికి తెలుగు రాకపోవడంతో తాము చెప్పింది వినడం లేదని వాపోయారు. తెలుగువారినే టీచర్లుగా నియమిస్తే బాగుంటుందని వారు తెలిపారు.

ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పాఠశాలలో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని ప్రిన్సిపాల్ బి.ఆర్. భైరవ, సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం మండలంలోని యార్లగడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థినుల సమస్యలు అడిగితెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.బాపన్నదొర, ఈవోపీఆర్డీ డి.శివకుమార్ హెచ్ఎమ్ మద్దికొండ ఝాన్సీ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందజేయాలి


మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ రెడ్డి ప్రసన్న

రాజవొమ్మంగి: స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను రాజమహేంద్రవరం 6వ అదనపు మెజిస్ట్రేట్ రెడ్డి ప్రసన్న శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు ఇక్కడికి రావడం జరిగిందని ఆమె తెలిపారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందజేయాలన్నారు. ఆమె వెంట స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి


- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: డుంబ్రిగుడ మండలం జామిగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విషయం తెలుసుకొన్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం స్పందించి కలెక్టర్ దినేష్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్‌లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిరుపతి పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే మత్స్యలింగం జామిగుడలో విద్యార్థినుల కలుషిత ఆహారం తిని వాంతులు, కడుపు నొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలుసుకొని వారి ఆరోగ్యం, అందుతున్న సేవలపై ఆరా తీశారు. శనివారం ఫోన్‌లో ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ విద్యార్థులను మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖ అధికారులకు మాట్లాడి ఆదేశించినట్లు తెలిపారు. జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశేశ్వరరాజు


పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును సన్మానిస్తున్న ఆలయ కమిటీ, గ్రామస్తులు

జి.మాడుగుల: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. మండలంలో పెదలోచలి పంచాయతీ పినలోచలి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు నిధులతో దేవదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ, గ్రామస్తులు పూలదండలు వేసి, శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల్లో మరింత భక్తిభావం పెరిగి కుటుంబాలు సుఖ సంతోషాలు ఉంటాయన్నారు. గ్రామాల్లో దేవాలయాలు నిర్మించుకోవటానికి ప్రజలు ముందుకురావాలని ఆయన కోరారు. సర్పంచ్ బోడిగి చిన్నకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మత్స్యంనాయుడు, వార్డు సభ్యుడు కె.రాజారావు, ఎల్.మూగనాయుడు, వి.శివ, ఎస్.రాజంపడాల్, ఎల్.అశోక్‌నాయుడు, టి.సుబ్బారావు, అర్చకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా రామకృష్ణప్రసాద్



సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా కింజరాపు రామకృష్ణ ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీ కేడర్‌లో ఉన్న రామకృష్ణ ప్రసాద్‌ను ప్రభుత్వం ఎస్పీగా పదోన్నతి కల్పించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆయన గురుద్వారా సమీపంలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.